తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
సోమవారం
3 ఆగస్టు 2026
పేజీలు - 8



## వాగు దాటించేందుకు గ్రామస్తులే ఆధారం

▫ ప్రాణాలకు ముప్పుగా మారిన రాకపోకలు.. ▫ శాశ్వత పరిష్కారం కోరుతున్న ప్రజలు

వార్త మెయిన్ 3లో

## హనుమకొండలో భార్యను హతమార్చిన భర్త

### కుటుంబ కలహాలతో కాళ్లు, చేతులు కట్టి మెడ కోసి దారుణ హత్య



**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 2 (జనం సాక్షి) :** హనుమకొండ నగరం లోని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధి 4వ డివిజన్ కృష్ణ కాలనీలో శనివారం రాత్రి దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి తన భార్యను అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

వార్త మెయిన్ 3లో



## మూడు ముక్కలాటగా 'వెంకటేశ్వర్లపల్లి'

▫ పోలీస్ స్టేషన్ పరకాల.. రెవిన్యూ నడికూడ.. మండల పరిషత్ కమలాపూర్

నడికుడ, ఆగస్టు 2 (జనంసాక్షి) : పరకాల అసెంబ్లీ ఎన్నికలలో ఎవరు పోటీలో నిలబడిన ఆ గ్రామం నుండి ప్రచారం ప్రారంభిస్తే గెలుపు ఖాయమని చెప్పుకునే వెంకటేశ్వర్ల పల్లి గ్రామం మూడుముక్కలాటగా మారింది. గ్రామానికి ఎలాంటి పనులు కావాలన్నా ప్రజలకు ఎలాంటి అవసరం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్న ఆగమ్య గోచరంగా ఏ మండలానికి వెళ్లిన ఒక్క పని మాత్రమే చేసుకుని తిరిగి రావాల్సి వస్తున్నదని మిగిలిన పనులన్నీ పెండింగ్లో ఉంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

వార్త మెయిన్ 7లో



## రహదారులపై బారికేడ్లు

• ప్రజలకు ఇబ్బందులు

**కాళేశ్వరం, ఆగస్టు 2 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనుల కోసం భారీ వాహనాలు వినియోగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయం పక్కనుండి మజీదుపల్లి , ఇప్పలబోరు ప్రాంతాలకు వెళ్లడానికి ఉన్న రహదారిపై ఆలయ అధికారులు వెల్డింగు తో ఇనుప పైపులు ఏర్పాటు చేశారు. గ్రామంలోని యూనియన్ బ్యాంక్ వద్ద కూడా గేట్లు ఏర్పాటు చేయడంతో పింఛన్ల కోసం బ్యాంకుకు వచ్చే వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. తమ పొలాలకు వెళ్లాలన్న , ఆటోలు, బైకులలో సమీప ప్రాంతాలకు వెళ్లాలన్న చాలా దూరం నుండి వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆలయ , గ్రామపంచాయతీ అధికారులు స్పందించి బైకులు , ఆటోలు వెళ్లడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు

• వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్



**నర్సంపేట, ఆగస్టు 2 (జనం సాక్షి) :** నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినీ స్టేడియంలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, స్నేహితులు, మహిళా వాకర్స్ ఉత్సాహంగా పాల్గొని పరస్పరం స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమానికి వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్, ఎస్సార్ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్, వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... స్నేహం మనిషి జీవితంలో ఎంతో విలువైన బంధమని, ఆరోగ్యకరమైన జీవనశైలితో పాటు మంచి స్నేహబంధాలను కొనసాగించడం ద్వారా ఆనందం, ఆత్మీయత పెరుగుతాయని అన్నారు. ప్రతిరోజూ వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు, వాకర్స్ మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆడపు సదానందం, కోశాధికారి సంకినేని కృష్ణ, స్టేడియం ఇన్చార్జి, కబడ్డీ కోచ్ యాట రవికుమార్ ముదిరాజ్, సభ్యులు కేశపాక అశోక్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యక్షులు అమ్మద్ పాషా, సంగేపు శ్రీనివాస్, మనోహర్ గౌడ్, సహాయ కార్యదర్శులు గండు రవి గౌడ్, వెంగల బిక్షపతి, మాజీ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ గుప్తా. పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సాన్యో శ్రీనివాస్, దొడ్డ రమేష్ గుప్త, లక్షపతి, క్రాంతి, సురేందర్, సాంబయ్య. తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సమస్యల వలయంలో మంతుర్తి ఐలయ్య నగర్ కాలనీ

- **డ్రైనేజీ సౌకర్యం లేక తీవ్ర అవస్థలు**
- **స్వల్ప వర్షానికి చెరువులను తలపిస్తున్న గుంతలు**
- **పట్టించుకోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు**

**కాజీపేట, ఆగస్టు2 (జనం సాక్షి) :** కాజీపేట పట్టణం మంతుర్తి ఐలయ్య నగర్ కాలనీలో డ్రైనేజీ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలు ఏర్పడి ఏళ్ళు గడుస్తున్నా నేటికీ రోడ్,డ్రైనేజీ సౌకర్యాలు కరువయ్యాయి. మురికి నీరు బయటకి పోవడానికి ఎటువంటి సౌకర్యం లేక ఇతర ప్రాంతాల నుంచి వచ్చే నీరు కాలనీలోనే నిలిచిపోవడంతో ఖాళీ ప్రదేశాలు నీటిమడుగులుగా మారుతున్నాయి.మురికినీరు ఖాళీ ప్రదేశంలో నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. మురుగు నీటి వల్లన ప్రజలు దొమకాటుకు గురై డెంగ్యూ,మలేరియ వచ్చే వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**రోడ్డు అస్తవ్యస్తంగా ఏర్పాటు, కొలతలలో తేడా**

కాజీపేట నుండి సోమిడి మెయిన్ రోడ్డు ఆనుకొని ఉన్న ఈ కాలనీలో కాలనీ బోర్డు నుండి 30 ఫీట్స్ రోడ్ ను గతంలో ఏర్పాటు చేశారు. ఇదే విధంగా పైకి కూడా రోడ్డు వెడల్పు ఏర్పాటు చేయకుండా తగ్గించి వేశారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మున్సిపల్ అధికారులు కూడా రోడ్డుకు ఇరువైపులా సమానంగా రోడ్డును విభజించి వేయకుండా ఒక భాగం వైపు మాత్రమే రోడ్డు పనులు చేపట్టారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రణాళిక ప్రకారం రోడ్డు, డ్రైనేజీ పనులు చేపట్టకుండా ఇష్టారితిన వ్యవహరించడం ఎవరికి వారే ఏర్పాటు చేసుకోవడం,తూతూ మంత్రంగా ఏర్పాటు చేసిన సౌకర్యాలు కూడా సరిగా లేవని కాలనీ ప్రజలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు.

**డ్రైనేజీ సౌకర్యం లేకుండానే రోడ్డు ఏర్పాటు**

ఈ కాలనీలో ముందుగా డ్రైనేజీ సౌకర్యం ఏర్పాటు చేయకుండానే రోడ్లు వేశారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు ప్రజా ప్రతినిధులకు అధికారులకు మొరపెట్టుకున్న డ్రైనేజీ సౌకర్యం కల్పించడం లేదని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో మిగిలిన చోట్ల డ్రైనేజీ పనులు చేపట్టిన తర్వాతనే రోడ్డు సౌకర్యం కల్పించాలని కాలనీ ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

**చిన్న వర్షానికే బురదమయమైన రోడ్లు**

కాలనీలో చిన్న వర్షానికి రోడ్లన్నీ బురదమయము అయినాయి. ఈ రోడ్డు గుండా కాలనీ ప్రజలు, వృద్ధులు వికలాంగులు, వాహనదారులు ప్రయాణించాలంటే ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు వినతి పత్రం అందజేసిన కూడ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు . ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులు తెలుసుకొని తమకు న్యాయం చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాశ్వత పరిష్కారాల దిశగా అధికారులు పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు.నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి అత్యవసర చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు





## తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య సంఘం సభ్యుడి నియామకం

**గోవిందరావుపేట, ఆగస్ట్02 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం యువజన విభాగం కార్య నిర్వాహక సభ్యుడిగా గోవిందరావుపేట గ్రామానికి చెందిన సందీప్ కిరాణం, జాకారం కొట్టు యాద నాగరాజు నియామకం.తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం,యువజన విభాగం నూతన కార్యవర్గ నియామకాల్లో భాగంగా గోవిందరావుపేట గ్రామానికి చెందిన,ప్రముఖ కిరాణా వ్యాపారవేత్త,జాకారం కొట్టు యాద సత్యనారాయణ, పద్మ దంపతుల చిన్న కుమారుడు యువ వ్యాపారవేత్త విద్యావేత్త అయిన యాద నాగ రాజు ని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర యువజన కార్య నిర్వహణ ఈసీ నిర్వహణ సభ్యుడిగా నియమించి రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సత్కరించడం జరిగింది.చిన్న వయసులోనే వ్యాపారంలో అన్ని మెలకువలు నేర్చుకున్న నాగరాజుకి ఇంత పెద్ద బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులకు అభినందనలు తెలుపుతూ ములుగు జిల్లా,గోవిందరావుపేట మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు బంధుమిత్రులు, నాగరాజు కి అభినందనలు తెలిపారు.

## కాంగ్రెసును నమ్ముకున్న వాళ్లకు న్యాయం జరగాలి

**ప్రియాంక గాంధీ సంఘటన్ ఆల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు యమునా రెడ్డి**

**వరంగల్లో పిజిఎస్ఏఐ సమావేశం**



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 02 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వాళ్లకు న్యాయం జరగాలని ప్రియాంక గాంధీ సంఘటన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఆరుముల్ల యమునా రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ నగరంలోని రోటరీ క్లబ్లో వరంగల్ జిల్లా ప్రియాంక గాంధీ సంఘటన్ ఆల్ ఇండియా (పీజీ ఎస్ ఏ ఐ) ఇన్చార్జి మేదరబోయిన రమేష్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యమునా రెడ్డి మాట్లాడుతూ వలస వచ్చిన వేరే పార్టీ కార్యకర్తల నుండి కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవాలన్నారు. సామాన్యుడి కోసం ఏర్పాటు చేసిన అదృష్ట ఫలాలను దళారుల చేతులకు వెళ్లకుండా చేయాలన్నారు. ప్రతి సమస్యను పై స్థాయి కాంగ్రెస్ కమాండర్స్ కి తెలియజేయటం జరుగుతుందని యమునారెడ్డి పేర్కొన్నారు. నిక్రమమైన పరిపాలని అందించటం కోసం పిజిఎస్ బాధ్యతగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అంటే ఒక క్రిస్టియన్ ఒక ముస్లిం అనే ముద్రతో ప్రతిపకాలు ఎత్తిచూపుతున్న తరుణంలో హిందూ ఓటు బ్యాంక్ కాపాడుకోవడం కోసం కృషి చేయాలన్నారు.. హిందూ ఓటు బ్యాంక్ కాపాడుకోవడం పిజిఎస్ ముఖ్య ఉద్దేశాలు ఇది తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ గా తాను తీసుకున్న నిర్ణయాలు ఈ ప్రియాంక గాంధీ సంఘటని ఆల్ ఇండియా ఆర్గనైజేషన్తో ఒకనూతన ఉద్దేశంతో ఉత్సాహంతో ప్రతి కార్యకర్త సంతోషపడేలా చేయాలని లక్ష్యంతో తన లాంటి వారిని ఎంచుకోవడం జరుగుతుందన్నారు. దీనిలో ప్రతి పోస్ట్ కి ఒక విలువ ఉంటుంది ఆ విలువకు తగ్గట్టుగా నాయకుడిని ఎంచుకోవడం జరుగుతుంది. అనుకోకుండా పోస్ట్ తీసుకొని పర్సనల్ యాక్టివిటీస్ కి ఉపయోగించుకుని పార్టీకి వర్క్ చేయని వాళ్లను డిస్మిస్ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందెల్లి ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ , మీడియా ఇంచార్జి నాంపల్లి యాదవ్, జిల్లా అధ్యక్షులు ఎస్ వెంకన్న, వరంగల్ నగర అధ్యక్షులు బిల్లా శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్చార్జి కొండేటి మహేందర్, వర్ధన్నపేట ఇన్చార్జి నందిపాక భాస్కర్, ఎండి. అస్మా తదితరులు పాల్గొన్నారు.



## ఆర్ఎంపీ, పీఎంపీల నూతన కమిటీ ఎంపిక

**అధ్యక్షుడుగా పొడిశెట్టి సైదులు..**

**పెద్దవంగర ఆగష్టు 02(జనం సాక్షి) :** ఆర్ఎంపీ, పిఎంపిల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపిక ఆదివారం మండల కేంద్రంలో బొమ్మకల్ గ్రామానికి చెందిన అధ్యక్షులు పొడిశెట్టి సైదులు, ప్రధానకార్యదర్శి సుదగాని రామ్మూర్తి కోశాధికారి కనుకుంట్ల. సంపత్, ఏకగ్రీవంగా ఎంపికయ్యారు, అధ్యక్షులు పొడిశెట్టి సైదులు మాట్లాడుతూ ఆర్ ఎం పి. పి ఎం పి. ప్రధమ చికిత్స మాత్రమే చేయాలని గ్రామాలలో ప్రతి పేద కుటుంబాన్ని గడప గడప తిరుగుతూ పేద ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్న వారిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షులు తలారి సోమన్న,మాజీ అధ్యక్షులు గుల్లపెల్లి సదానందం. కోశాధికారి సంపత్,ఉప అధ్యక్షులు రామచంద్రు, కార్యవర్గ సభ్యులు కృష్ణ, కూతటి రమేష్. అశోక్. యాకన్న. ఆనంద్, సత్యనారాయణ. షతీష్. భూక్యా వెంకన్న. భాస్కర్, మల్లేష్,అశోక్,హరీష్. రమేష్,బాలు, కృష్ణ, శ్రీనివాస్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**కెరమెరి మండల ఆదివాసీ నాయకుల పిలుపు**

**కెరమెరి, ఆగస్టు2(జనంసాక్షి) :** కెరమెరి మండలంలో ఈ నెల ఆగస్టు 9న జరగబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించాలని కెరమెరి మండల ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక కొమురం భీం ఆదివాసీ భవన్లో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో వేడుకల నిర్వహణ, కార్యాచరణపై ఆదివాసీ నాయకులు, రాయ్ సెంటర్ పెద్దలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి ఏటా జరుపుకున్నట్లే ఈ సంవత్సరం కూడా మండలంలోని ప్రతీ గ్రామంలో ఆదివాసీ జెండాలను పండుగ వాతావరణంలో ఎగురవేయాలని, ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు పకడ్బందీగా అమలయ్యేలా వేడుకల రోజున తీర్మానాలు ప్రవేశపెట్టాలని, ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ వేడుకల ద్వారా ఆదివాసీల ఐక్యతను చాటి చెప్పాలని అన్నారు. ఈ సన్నాహక సమావేశంలో కెరమెరి మండల ఆదివాసీ జిల్లా నాయకులు, రాయ్ సెంటర్ పెద్దలు, మండల ప్రజాప్రతినిధులు, వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## త్వరలోనే ఎంఆర్పిఎస్ మండల, గ్రామ కమిటీల ఏర్పాటు



**గూడూరు,ఆగస్టు03(జనంసాక్షి):** గూడూరు మండలంలో త్వరలోనే మండల, గ్రామ కమిటీలను నియమిస్తామని మానుకోట జిల్లా ఇంచార్జి జన్ను దినేష్ అన్నారు. ఆదివారం గూడూరు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి,మండల సమీక్ష సమావేశం మండల ఇంచార్జ్ కొమ్ము నాగరాజు మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జ్ జన్ను దినేష్ మాదిగ,కో–ఇంచార్జ్ ఏకు శంకర్ మాదిగ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాజీలేని పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణను సాధించడమే కాకుండా మాదిగలతో పాటు,పేద వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాలు నడిపి అనేక సంక్షేమ పథకాలు సాధించిన ఘనత ఎమ్మార్పీఎస్ కు ఉందని ప్రజా సమస్యలను గుర్తించి ప్రజా పోరాటాలను నిర్మించాలని అన్నారు.రాబోయే రోజులల్లో

నూతన తరాన్ని ఉద్యమంలోకి తీసుకువచ్చి శక్తివంతమైన సైన్యంగా తయారు చేసేందుకు ఎమ్మార్పీఎస్ శ్రేణులు శ్రమించాల కోరారు.

రాబోయే రోజుల్లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్ శ్రేణులు కుల వివక్షత సాంఘిక అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం సిద్ధంగా ఉండి పోరాడాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్పి జాతీయ నాయకులు గుగ్గిళ్ళ పీరయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పాశం సాంబయ్య మాదిగ,గద్దల బాబు మాదిగ,బొక్క పాషా మాదిగ,చెరుకు రవీందర్ మాదిగ,బొక్కల అశోక్, ఆరోగ్యం మాదిగ,బొల్లం లక్ష్మణ్,తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

### భూపతి వెంకటేశ్వర్లు : సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు



**పరకాల, ఆగస్టు 2, (జనం సాక్షి):** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద విధానాలను అవలంబిస్తుందని దానికి వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపతి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఫంక్షనల్ హాల్ లో రెండు రోజుల జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు సిపిఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి ప్రిన్సిపాల్ గా వ్యవహరించగా వెంకటేశ్వర్లు ముఖ్యదిగా పాల్గొని మతం మతోన్మాదం అనే అంశంపై ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులైన అంబానీ, ఆదానిలాంటి వారికి దేశ సంపదను దోచిపెడుతూ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ దేశ సంపదను డ్యూటీ చేస్తుందని ఆయన మండిపడ్డారు. అలాగే కష్టజీవులైన కార్మికులు వ్యవసాయ కూలీలు రైతులకు రక్షణగా ఉన్న చట్టాలకు తూట్లు పొడుస్తూ దేశంలో నిరుద్యోగం పేదరికం దారిద్రం విపరీతంగా పెరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఈ విషయాలపై ఆలోచించకుండా దృష్టి మలచడం కోసం హిందుత్వ ముసుగులో ఇతర మతాలపై విద్వేషాలు రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య వైశాల్యాలు సృష్టిస్తుందని వారు మండిపడ్డారు. దేశంలో లౌకిక సామ్యవాద విలువలను రాజ్యాంగాన్ని మార్చాలని ఆలోచన బిజెపి చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బిజెపి ప్రభుత్వం చేస్తున్న సంపదలూటీ, కార్పొరేట్లకు ఆస్తులు దోచి పెట్టడం హిందుత్వ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యం చేసి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యం చుక్కయ్య, పార్టీ కమిటీ సభ్యులు టీ. ఉప్పలయ్య, గొడుగు వెంకట్, కే. లింగయ్య దొగ్గెల తిరుపతి, పరకాల పట్టణ కార్యదర్శి బొచ్చు కళ్యాణ్, నాయకులు బొచ్చు ఆదాం, జి. మహేందర్, కుక్కముడి రవీందర్, బొచ్చు. ఈశ్వర్, బొజ్జ హేమంత్, చరణ్, రౌతు శ్రీలత, మోహన్ కమల్, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని విజయవంతం చేయండి

### ఆదివాసీ ఉద్యోగ సంఘం పిలుపు



**ములుగు,ఆగస్టు02(జనం సాక్షి):**-ఆగస్టు 9 ఆదివారం రోజున ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగు జిల్లా కేంద్రంలో జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసి ఉద్యోగుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ములుగు జిల్లా కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ నిర్వహణ కై ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి ఆదివాసుల ఐక్యతను చాటుదాం అని,మన ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకుందాం అని, ప్రతి ఆదివాసీ మహిళలు ఉద్యోగులు యువకులు విద్యార్థిని విద్యార్థులు అందరూ ఈ ఆగస్టు 9 ఆదివారం రోజున జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమం లో పాల్గొనాలని మనవి చేసారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఆదివాసి గూడెం నుండి స్వచ్ఛందంగా ములుగు జిల్లా కేంద్రానికి తరలి రావాలని ఆదివాసి ఉద్యోగుల సంఘం తరపున పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ అల్లం అప్పయ్య, ములుగు జిల్లా అధ్యక్షులు మంకిడి రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరం రవికాంత్,అర్రెం నారాయణ, దనసరి బాబురావు,ఈక కుమారస్వామి, వి రామకృష్ణ,కె. కృష్ణ,ఏ. రాజేష్ కుమార్,ఈ. సందీప్,ఏ. జగ్గారావు, కె. అశోక్,పి. కుమారస్వామి,మంకిడి రాజబాబు, రామచందర్,నారాయణ,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# బలపాల దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- అంబేద్కర్ అభయ హస్తం ద్వారా దళిత యువతకు ఉపాధి కల్పించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య

**మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు2 (జనం సాక్షి):**మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బలపాల గ్రామంలోని దళిత కాలనీలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సర్వేలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమాజంలో అత్యంత వెనుకబడిన దళితులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సుమారు 250 దళిత కుటుంబాలు నివసిస్తున్నాయని, వీరిలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలుగా జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. ఇల్లు లేని అర్హులందరికీ ఎలాంటి అభ్యంతరాలు లేకుండా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. దళిత యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో పెయింటర్లు, బిల్డింగ్ వర్కర్లు, ఇతర దినసరి కూలీలుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా రూ.12 లక్షల ఆర్థిక సహాయం అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. దళితులకు కేటాయించిన కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరుకుందని, దాని స్థానంలో కొత్త భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ వితంతు, వికలాంగ, వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయాలని, ఎన్నికల సమ యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలైన మహిళలకు నెలకు రూ.2,500, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12,000, వృద్ధాప్య పెన్షన్‌ను రూ.4,000, వికలాంగుల పెన్షన్‌ను రూ.6,000కు పెంచే హామీలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, గ్రామ ఉపసర్పంచ్ పిట్టల వెంకన్న, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మలేటి కోటయ్య, గిరిజన సంఘం కురవి మండల కార్యదర్శి మాలోత్ కిషన్ నాయక్, మత్స్య కార్మిక సంఘం జిల్లా నాయకులు పిట్టల దరగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు శనిగరం వెంకన్న, సీఐటీయూ నాయకులు గోపి, స్థానిక కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దికి నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు



**చెన్నారావుపేట, ఆగస్టు 2 ( జనం సాక్షి):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మూడవ రోజు కార్యక్రమానికి బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న హాజరై ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం ఆయన మూడవ రోజు కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి వెళ్లి ఆయన చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్, చెన్నారావుపేట మాజీ సొసైటీ చైర్మన్ చింతకింది వంశీ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అమ్మ రాజేష్, మండల నాయకులు ములుక సాంబయ్యకవి, బోడ సమ్మునాయక్, బాదా వతు వీరన్న, మొగిలి కేశవరెడ్డి, అంగోతు వీరాసింగ్,మండల సోషల్ మీడియా ఇంచార్జ్ బోడ మురళి నాయక్, నాయకులు మల్లాడి వీరారెడ్డి, బానోత్ గణేష్, మేడి సతీష్, మంగళగిరి సదయ్య, తదితరులు ఉన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీపీ



**చెన్నారావుపేట,ఆగస్టు 2( జనంసాక్షి ):** మృతుడి కుటుంబాన్ని చెన్నారావుపేట మాజీ ఎంపీపీ కేతిడి వీరా రెడ్డి పరామర్శించారు. మండలంలోని జల్లి గ్రామానికి చెందిన పాలకుర్తి యాకయ్య ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆదివారం జరిగింది. మాజీ ఎంపీపీ కేతిడి వీరా రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులు పాలకుర్తి బిక్షపతి, సారంగపాణి, విజయ్ కుమార్ లను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కుర్ర వెంకటేశ్వర్లు (బాబుసార్ ), నాంపల్లి రవిందర్. పులి వీరస్వామి, పాలకుర్తి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆదివారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో తాగునీటి కొరత, అపరిశుభ్రత, క్షణిక చిత్ర పరికరం పనిచేయకపోవడం, ఆక్సిజన్ కేంద్రం సమస్యలను పరిశీలించారు. చిన్న సమస్య వచ్చినా ఇతర ఆసుపత్రులకు పంపుతున్నారని, ఇది రిఫరల్ కేంద్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పూర్తిస్థాయి వైద్య సేవలు ఉండవా అని ప్రశ్నించారు. ఐదు రోజులుగా తాగునీరు లేదని, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో తక్షణమే తాగునీరు, పరిశుభ్రత, వైద్యులు, మందులు, పరికరాలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిని బలోపేతం చేయాలని కోరారు.

# ఉత్సాహంగా,ఉల్లాసంగా మ్యూజికల్ నైట్



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 2 (జనం సాక్షి)**గాన గాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం , గాన కోకిల ఎస్ జానకి యాదిలో ఓరుగల్లులో స్వరాభిషేకం కార్యక్రమాన్ని గ్రాండ్ లైవ్ మ్యూజికల్ నైట్ ఆగస్టు ఒకటి 2026 సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా కవిత ధార డిసిపి సెంట్రల్ జోన్ వరంగల్ ,ఈగ మల్లేశం తెలుగు స్టేట్స్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ మరియు కేంద్ర ఖాది మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్,గట్టు మహేష్‌బాబు ఆర్యవైశ్య జాతీయ ఫెడరేషన్ నాయకుడు. మరియు బూర విద్యాసాగర్,పద్మజ,ఆడెపు రవీందర్, రావెళ్ళ రామారావు తదితరులు పాల్గొనగా జిల్లాలోని సీనియర్ గాయని గాయకులు మరియు వాయిద్య కారులు సుమారు 50 మంది ఒకే వేదికపై అద్భుతంగా బాలు మరియు జానకి ఆలపించిన ఎన్నో మధుర గీతాలు లైవ్ ఆర్కెస్ట్రా ద్వారా కళాకారులు పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సకల కళలకు పుట్టినిల్లు ,కళల కాణాచి అయిన వరంగల్ జిల్లాలోనీ సీనియర్ కళాకారులు అందరి ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 12 మంది వాయిధ్య కళాకారులు. 40 మంది గాయనీ గాయకులు సినిమా ఆర్కెస్ట్రా ను మించి లైవ్ ప్రోగ్రామ్ చేశారు. వరంగల్ లో ఇలాంటి గ్రాండ్ లైవ్ ఆర్కెస్ట్రా జరగడం ఇదే మొదటి సారి. ఈ కార్యక్రమం లో గాయకులు గణేష్, చార్లెస్,రాము, సుదర్శన్, చంద్ర శేఖర్,కరుణాకర్,రవిరాజు,టీవీరమేష్,బొమ్మెరరాజు, సుకుమార్. దేవేందర్, కన్నయ్య,రామారావు,రజిత,స్వప్న,కీర్తి,స్వప్న,పావని,పరమేశ్వరి,రాధిక,రాణి. కృష్ణవేణి,మాధవి. శ్వేత,రాణి మరియు వాయిధ్య కళాకారులు విజయ్,మున్నా, వాజిద్,రవీందర్, డాన్ సృజన్,రంగనాథ్, పాల్సన్, అనిల్, సర్వేశ్, పాల్, సౌండ్స్ నరేష్ లు పాల్గొన్నారు.

# సామాజిక సమరసతకు ప్రతీక సంత్ గురు రవిదాస్ మహారాజ్..

**తాండూర్, ఆగస్టు 02(జనం సాక్షి) :** సామాజిక సమరసతకు ప్రతీక సంత్ గురు రవిదాస్ మహారాజ్ అని బిజెపి ఎస్సీ మోర్చా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈ సందర్భంగా భీమిని మండలంలోని వెంకటపూర్ గ్రామంలో బిజెపి కార్యకర్త నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంత్ గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి సందర్భంగా బిజెపి ఎస్సీ మోర్చా దేశవ్యాప్తంగా వారి యొక్క జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు.అందులో భాగంగానే వారి జన్మస్థలం కాశి దగ్గరలోని సీర్ గోవర్ధనపూర్ నుండి మట్టిని సేకరించి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు మండలాలకు రథయాత్ర ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు.సమానత్వం, సామాజిక న్యాయం, మానవత్వం, భక్తి మార్గాలకు ప్రతీకగా నిలిచిన



మహనీయుడు సంత్ గురు రవిదాస్ మహారాజ్ అని అన్నారు.సంత్ గురు రవిదాస్ మహారాజ్ కుల, మత, వర్గ వివక్షలకు అతీతంగా ప్రతి మనిషి సమానుడనే గొప్ప సందేశాన్ని సమాజానికి అందించారు.ప్రేమ, సోదరభావం, సేవా తత్వం, నిజాయితీతో కూడిన జీవన విధానాన్ని ఆయన బోధించారు.సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి అన్నారు. ఆయన బోధనలు నేటికీ సమానత్వం, సామాజిక సామరస్యం, మానవ విలువలను పెంపొందించే మార్గదర్శకాలుగా నిలిచాయని అన్నారు.భారత యువత ఆయన ఆదర్శాలను అనుసరిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.సంత్ గురు రవిదాస్ మహారాజ్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వం,సామాజిక న్యాయం,మానవ గౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కొంక సత్యనారాయణ,మండల ప్రధాన కార్యదర్శి ముత్యం పురుషోత్తం గౌడ్,జిల్లా కౌన్సిల్ సభ్యులు బత్తని రమేష్ గౌడ్,యువ మోర్చా మలిశెట్టి లచ్చన్న,నాయకులు బత్తని బాపు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# గుడిహత్నూర్ బీజేపీ మండల అధ్యక్షుడు సస్పెండ్

- **సస్పెన్షన్ అనంతరం బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ మండల అధ్యక్షుడు కేంద్రే శివాజీ**

**గుడిహత్నూర్, ఆగస్టు 2 (జనంసాక్షి) :** గుడిహత్నూర్ మండల బీజేపీ అధ్యక్షుడు కేంద్రే శివాజీని పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో భారతీయ జనతా పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు మండల అధ్యక్ష పదవి నుంచి సస్పెండ్ చేసినట్లు బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ ప్రకటించారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించడం, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలను సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఇదే రోజు కేంద్రే శివాజీతో పాటు మాజీ మండల అధ్యక్షుడు జాడి సుభాష్, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో ఉపసర్పంచ్ సుశీల్, మండల ఉపాధ్యక్షులు కారాడ్ రవి, మూర్కుటే వినోద్, బూత్ అధ్యక్షులు జగదీష్, విక్కీ కేంద్రే, చంద్రగిరి శేఖర్, బీజేవైఎం నాయకులు బక్వాడ్ ఆకాష్, నీతేష్, గోరక్షక్ జిల్లా అధ్యక్షుడు శశికిరణ్, విష్ణు, బాల్వంత్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.



# బోనాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన కవితా రెడ్డి

**నిర్మల్ టౌన్, ఆగస్టు 2 (జనంసాక్షి) :** బోనాల పండుగ సందర్భంగా నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సతీమణి ఏలేటి కవితా రెడ్డి ఆదివారం నందిగుండం దుర్గామాత ఆలయం, బంగల్‌పేట్ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయాలను సందర్శించి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. ఒడి బియ్యం పోసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులతో నిర్మల్ జిల్లా ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కవితా రెడ్డి ఆకాంక్షించారు. అమ్మవారి దివ్య కరుణాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.

# కిస్టాపూర్‌లో తొలిసారిగా వర్షవాస్ కార్యక్రమం ప్రారంభం

**రెబ్బెన, ఆగస్టు 02(జనం సాక్షి):** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం కిస్టాపూర్ గ్రామంలో తొలిసారిగా నిర్వహించిన వర్షవాస్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. గ్రామానికి చెందిన బౌద్ధ ఉపాసకులు, యువత, మహిళలు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, బౌద్ధ ధర్మంలో వర్షవాస్‌కు విశిష్ట స్థానం ఉందని, బుద్ధుని బోధనలు సమాజంలో శాంతి, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. వర్షవాస్ కాలంలో ధర్మ అధ్యయనం, త్రిపిటక గ్రంథాల పఠనం, ధ్యానం, సద్గుణాల ఆచరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సెంటర్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రశాంత్ మాట్లాడుతూ, బౌద్ధ ధర్మ విలువలను యువతలో పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కిస్టాపూర్‌లో ప్రారంభమైన వర్షవాస్ కార్యక్రమం భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ కమిటీ ఉపాధ్యక్షులు కోబ్రగడె విలాస్, సుబ్బయ్య,



సహాయ కార్యదర్శి తక్సండే శంకర్, బౌద్ధ అధ్యాపకులు కిషన్, పండు, నంబాల గ్రామ అధ్యక్షులు దుర్గం శివాజీ, ఆనంద్, సెంటర్ కమిటీ కల్చరల్ సభ్యుడు కట్కర్ అజిత్, కిస్టాపూర్ గ్రామ అధ్యక్షుడు చునర్కర్ పాపయ్య, అంబేద్కర్ పరిరక్షణ కమిటీ సభ్యులు సునర్కర్ ప్రేమల, రూప, లలిత, సమాజ్ అధ్యక్షుడు సునర్కర్ శంకర్, సునర్కర్ మొండయ్య, వార్డు సభ్యుడు సునర్కర్ సురేష్, గోమాస శ్రీకాంత్‌తో పాటు గ్రామ ఉపాసకులు, ఉపాసికలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రతి ఏడాది మరింత విస్తృతంగా నిర్వహించాలని పాల్గొన్నవారు సంకల్పించారు.

# వారసంతపు పన్ను రద్దు చేయాలని ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ వినతి

**గుడిహత్నూర్, ఆగస్టు 2 (జనం సాక్షి ):** గుడిహత్నూర్ మండలంలోని మాన్కాపూర్ , మచ్చాపూర్, తోషం తదితర గ్రామాలకు చెందిన ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ సభ్యులు వరసంతపు పన్ను వసూలును నిలిపివేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఆడే శిలాకు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసీం ఖాన్ మాట్లాడుతూ, గతంలో ఎన్నడూ లేని విధంగా తమ గ్రామాల ఆటోలపై మాత్రమే వరసంతపు పన్ను విధించడం సరైంది కాదన్నారు. పంచాయతీ అధికారులు ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి, డ్రైవర్లు మరియు వాహన యజమానులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే వాహనాలకు సంబంధించి వివిధ రకాల పన్నులు, అనుమతుల ఫీజులు, నిర్వహణ ఖర్చులు అధికంగా ఉన్నాయని,



ఇలాంటి పరిస్థితుల్లో అదనంగా వరసంతపు పన్ను చెల్లించడం ఆర్థిక భారం అవుతోందని పేర్కొన్నారు. అందువల్ల ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలపై వరసంతపు పన్ను వసూలు చేయకుండా మినహాయింపు ఇచ్చి తమకు సహకరించాలని యూనియన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ సభ్యులు, వాహన యజమానులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో నూతన ఎస్సైకి సన్మానం.



**కెరమెరి, ఆగస్టు2 (జనంసాక్షి) :** కెరమెరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సై శ్రీకాంత్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి,పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాగ్మారె శ్రీకాంత్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాజీద్ దేశ్ ముఖ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాథోడ్ శంకర్ నాయక్, రాథోడ్ సుదర్శన్,మాజీ ఎంపిటిసి గోగర్ల రాజయ్య, మాజీ సర్పంచ్ జగన్నాథ్ రావు, మొహార్లే బాపురావు, దండుగుల శ్రీనివాస్,జాదవ్ ప్రకాష్, దేవిదాస్, గిడ్డప్ప, మహమ్మద్, వెంకటి,దిలీప్,నాగుపటేల్, రవూఫ్,మడవి రాజు,ముండే మహాదవ్, రమేష్, దుర్గయ్య, తిరుపతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆర్థిక సాయం అందజేత



**దిలావర్‌పూర్, ఆగస్టు 2 (జనం సాక్షి): :** స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమ స్నేహబంధాన్ని మరోసారి చాటుకున్నారు. సహ విద్యార్థిని సంయుక్త భర్త ఇటీవల మృతిచెందడంతో ఆమెకు అండగా నిలిచేందుకు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, కష్టకాలంలో స్నేహితులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో సంయుక్త కుటుంబానికి ఎలాంటి అవసరం వచ్చినా తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

# పోచమ్మ గుడి అభివృద్ధికి కృషి

**నస్పూర్ (జనంసాక్షి):** శ్రీరాంపూర్ కాలనీ వాటర్ ట్యాంక్ ఏరియాలోని పోచమ్మ గుడి అభివృద్ధికి కృషి చేస్తానని 29వ డివిజన్ కార్పొరేటర్ బండారి సుధాకర్ తెలిపారు. ఆదివారం గుడి ఆవరణలో జరిగిన గుడి అభివృద్ధి కార్యాచరణ సమావేశంలో కార్పొరేటర్ బండారి సుధాకర్ మాట్లాడుతూ పోచమ్మ గుడి అభివృద్ధికి శ్రీరాంపూర్ కాలనీ,వాటర్ ట్యాంక్ ఏరియాల ప్రజలు సహకరించి కృషి చేయాలని కోరారు.అనంతరం గుడి పూజారి అరుణ్ శర్మ ఆద్వర్యంలో పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో



కార్పొరేటర్ వేల్పుల రవీందర్,మాజీ మున్సిపల్ చైర్మన్ ఇసాంపల్లి ప్రభాకర్,మాజీ సర్పంచ్ జక్కుల రాజేశం తదితరులు పాల్గొని గుడి నూతన కమిటి ఎన్నుకున్నారు.గుడి అభివృద్ధి కమికి గౌరవ అధ్యక్షుడిగా బండారి సుధాకర్,ముఖ్య సలహాదారులుగా కార్పొరేటర్లు వేల్పుల రవీందర్, వనపర్తి కేత రాజేశ్,మేకల రమేష్, అధ్యక్షుడిగా అర్కాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గడ్డల మధు,నాగుల శంకరయ్య,ప్రధాన కార్యదర్శిగా రాసమల్ల దేవేందర్,కార్యదర్శిగా వేముగంటి శ్రీనివాస్,సహాయ కార్యదర్శిగా మూట లక్ష్మణ్,కోశాదికారిగా లకావత్ రమేష్,సహాయ కోశాధికారిగా లెక్కపురం రవి,ప్రచార కార్యదర్శిగా వడిజ మహేందర్,మీడియా ఇంచార్జిగా భాస్కర్ల రాజేశం,సాంస్కృతిక శాఖ అధ్యక్షులుగా బోగ మదునయ్య, కార్యదర్శిగా పెద్దపల్లి శంకర్,అధికార ప్రతినిధిగా గుర్రపు సురేష్ ఎన్నికయ్యారు.

# శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో సీసీ పనులు ప్రారంభం

## దాతల సేవాభావానికి గ్రామస్థుల ప్రశంసలు



**పాలకుర్తి. ఆగస్టు 02 (జనంసాక్షి)** పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం సీసీ ప్లాట్‌ఫారం నిర్మాణ పనుల కార్యక్రమానికి దాతగా పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచ్ శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం మాజీ డైరెక్టర్ కాటబత్తిని రమేష్-పద్మ దంపతుల కుమారుడు కాటబత్తిని సూర్య ముందుకు వచ్చి. నిర్మాణానికి అవసరమైన సుమారు 2 లక్షల రూపాయలను సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న లకు అందజేయగా, సీసీ ప్లాట్ ఫామ్ నిర్మాణ పనులను ఆదివారం గ్రామ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న. ఉప సర్పంచ్. వార్డు సభ్యులు. గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా దేవాలయ అభివృద్ధిలో ఒక అడుగు ముందుకు వేస్తూ. దేవాలయంలో గ్రానైట్ ఏర్పాటుకు తన వంతుగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్ తన తండ్రి జ్ఞాపకార్థం సుమారు 1 లక్ష రూపాయలు గ్రామపంచాయతీ పాలకవర్గానికి అందించగా, త్వరలోనే నిర్మాణ పనులను చేపట్టనున్నట్లు సర్పంచ్ విజయ నాగన్న తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న గౌడ్ మాట్లాడుతూ, "గ్రామ దేవాలయాల అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినంద ॅనీయమన్నారు.. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయనీ,. సహకరించిన దాతలందరికీ గ్రామపంచాయతీ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతల పేర్లతో శిలా పథకాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గాదేపాక కిరణ్, వార్డు సభ్యులు కత్తి దస్తగిరి. సలేంద్ర రమా- సోమన్న, మామిండ్ల కవిత--శోభన్ బాబు, దాసరి అనూష--మధు, సలేంద్ర కళ్యాణి--సందీప్, ఎలుమ కంటి స్వప్న-సతీష్. కామారపు సునీల్, నెమరుగోమ్ముల శ్రీనివాసరావు. కమ్మగాని శ్రీకాంత్ గౌడ్. కమ్మగాని సుధాకర్ గౌడ్, గ్రామ పెద్దలు వీరమనేని సోమేశ్వరరావు. కమ్మగాని పరమేశ్వర్. కమ్మగాని పరశురాములు. జీడి మనోహర్. చిదురాల ఎల్లయ్య. చిట్యాల యాకయ్య. కాటబత్తిని సోమన్న. కడుదుల కర్ణాకర్ రెడ్డి. పెనుగొండ రమేష్. రాజ్ మహమ్మద్. తాళ్ల రామకృష్ణ. కోలా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దికి నివాళులు అర్పించిన బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్



**చెన్నారావుపేట, ఆగస్టు 2 ( జనం సాక్షి ):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటం వద్ద చెన్నారావుపేట బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొండవీటి ప్రదీప్ కుమార్ నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మూడవరోజు కార్యక్రమంలో వరంగల్ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ తో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట తిమ్మరాయిని పహాడ్ సర్పంచ్ ధారావత్ రమేష్, మేర సంఘం చెన్నారావుపేట మండల అధ్యక్షులు గట్ల రాంబాబు, అడుప రమేష్, కంకల రాజు, సూర రంజిత్, తదితరులు ఉన్నారు.

# బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాది

## మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి,ఆగస్టు 02 (జనంసాక్షి).** ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి తల్లి తన బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే తల్లిపాలు అందించాలని తెలిపారు. తల్లిపాలు శిశువుకు సురక్షితమైనవి, స్వచ్ఛమైనవి, పోషక విలువలు కలిగినవని, శిశువు ఆరోగ్యవంతంగా ఎదగడానికి తల్లిపాలే బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం తల్లిపాలు ఎంతో అవసరమని, కనీసం ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం వరకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. తల్లిపాలు అందించడం ప్రతి బిడ్డ హక్కు అని, ప్రతి తల్లి తన మాతృత్వ బాధ్యతను గుర్తించి పిల్లలకు తల్లిపాలు అందించాలని కోరారు. తల్లులు తీసుకునే పోషకాహారం ద్వారానే స్వచ్ఛమైన పాలు బిడ్డలకు అందుతాయని, దీంతో పిల్లలు ఆరోగ్యంగా, దృఢంగా ఎదుగుతారని తెలిపారు. బలమైన బాల్యానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తల్లులను ప్రోత్సహించి, ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. తల్లులందరికీ ప్రపంచ తల్లి పాల వారోత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు.

# చిన్నారి దీక్షితకు ఆశీస్సులందించిన కాంగ్రెస్ నేతలు



**దేవరుప్పుల, ఆగస్టు 2 (జనం సాక్షి)** దేవరుప్పుల మండలం కామారెడ్డి గూడెం గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు పులిపంపుల సురేష్, రేణుక దంపతుల కుమార్తె దీక్షిత నూతన వస్త్రాలంకరణ వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించిన. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దావేర అనిల్ కుమార్ ఈ కార్యక్రమంలో, మాజీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, జిల్లా ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇనుముల నాగరాజు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న, జాకీర్, రెడ్డిరాజుల రమేష్, బోనగిరి యాకస్వామి, పల్లపు రవి, తోటకూరి రమేష్‌తో పాటు గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# యువతకు మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన సదస్సు



**హనుమకొండ ప్రతినిధి ఆగస్టు 2 (జనం సాక్షి) :** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎంవై భారత్ వరంగల్ సంస్థ హనుమకొండ నగరం లోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో "నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్" కార్యక్రమాన్ని విజయవంతంగ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, యువతకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. విద్యార్థులు మరియు యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్ మరియు ఇతర హానికర పదార్థాల వినియోగానికి దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎంవై భారత్ వరంగల్ జిల్లా యువజన అధికారి శ్రీ భూక్య సంజీవ్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలను వివరించారు. అలాగే ఎంవై భారత్ శాఖ దేశ యువత కోసం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, యువజనాభివృద్ధి చర్యలు మరియు ఎంవై భారత్ పోర్టల్ ద్వారా లభించే అవకాశాల గురించి సమగ్రంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, ఆరోగ్యవంతమైన మరియు బాధ్యతాయుతమైన జీవితాన్ని గడపాలని ఆయన యువతకు సందేశం అందించారు.

# బాధిత కుటుంబానికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహాయం



**పాలకుర్తి, ఆగస్టు 02 (జనంసాక్షి)** మండల కేంద్రానికి చెందిన ఎడవెల్లి ఉప్పలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబసభ్యులను అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పరామర్శించి. 25 కేజీల బియ్యం,నిత్యావసర సరుకులను అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్ పాల్గొని మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి, ఆసరా ఇవ్వడం ఆత్మ సంతృప్తినిస్తుందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకారాన్ని అందించిన ఉపాధ్యాయురాలు చుంచు శ్రీలత కు ట్రస్ట్ తరుపున కృతజ్ఞతలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి ఒర్రె కుమారస్వామి ట్రస్ట్ ప్రతినిధి పెండ్లి భాస్కర్ రెడ్డి. మృతుడి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా

## మండలశాఖ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు



**మంగపేట ఆగస్టు 02(జనంసాక్షి)** మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దిరాల సత్యం ఇటీవల మృతి చెందాడు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన మృతుడి నివాసానికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆ కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, దామెర సారయ్య, కబ్బాక లక్ష్మణ్,సోషల్‌మీడియాఇంచార్జ్ బసారికానినాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ శివునిపల్లి ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 02 ( జనం సాక్షి ) :** పిడిజి లయన్ వెంకటేశ్వర్ రావు జన్మదినం సందర్భంగా ఆయన గవర్నర్ గా ఉన్నపుడు చేసిన కార్యక్రమం ఆదర్శంగా తీసుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ శివునిపల్లి అధ్యక్షుడు తుమ్మనపల్లి రవికిరణ్ ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని ఆసుపత్రిలోని రోగులకు అల్పాహారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మనపల్లి రవికిరణ్ మాట్లాడు తూ లయన్స్ క్లబ్ ఆఫ్ శివునిపల్లి సభ్యుల సహ కారంతో రోజు 5 నుండి 10 మందికి అల్పాహారం అందించే చిరు కార్యక్రమానికి పునాది వేసామని అన్నారు. ఇందులో భాగంగా మొదటి రోజున పిఎస్ టి ల సహకారంతో కొందరు మునిసిపాలిటీ కార్మికులకు అనాథలకు, ప్రభుత్వ హాస్పిటల్ లోని రోగులు 20 మందికి అల్పాహారం పండ్లు పంచటం జరిగింది. ఈ



కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ శివునిపల్లి అధ్యక్షులు లయన్ తుమ్మన పల్లి రవికిరణ్, సెక్రటరీ పులి వినయ్ కుమార్, ట్రెజరర్ కందగట్ల శ్రీకాంత్, పూర్వ అధ్యక్షుడు మొహమ్మద్ దస్తగిరి, లయన్ సభ్యులు కోట రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# క్లాస్మేట్ కుటుంబానికి 1 లక్ష 55 వేలు ఆర్థిక సహాయం

### స్నేహితుల దినోత్సవం రోజున తమ దాతృత్వం చాటిన తోటి మిత్రులు

**పాలకుర్తి. ఆగస్టు 02 (జనంసాక్షి)**కాలేయ సమస్యతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్న తమ తోటి డైట్ క్లాస్మేట్ దుర్గాదేవి కి అండగా నిలుస్తూ, వరంగల్ డైట్ (2003--2005 బ్యాచ్) మిత్రులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. చికిత్స కోసం అత్యవసరంగా నిధులు అవసరమవడంతో తోటి మిత్రుల సహకారంతో ఒక లక్ష 55 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత మిత్రురాలికి, ఆమె కుటుంబ సభ్యులకు తోటి స్నేహితులు ధైర్యం చెప్పారు. ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, మిత్రత్వానికి ఇదే నిజమైన నిదర్శనమని వారు పేర్కొన్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా తోటి స్నేహితురాలికి మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. స్నేహానికి నిదర్శనంగా తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.ఆర్థిక సహాయం అందించిన వరంగల్ డైట్ (2003--2005) బ్యాచ్‌కు చెందిన ప్రతి మిత్రునికి దుర్గాదేవి మరియు ఆమె



కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆర్థిక సహాయం ఆమె వైద్య చికిత్సకు ఎంతో ఉపయోగపడుతుందని, తమకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి జీవితాంతం రుణపడి ఉంటామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు ఆర్. మనోహర్, ఎ. సాగర్, బి. అశోక్, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 02 ( జనం సాక్షి ) :**స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని రైల్వే కాలనీ కి చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి బోసు ఐలయ్య మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి, ఎంఎల్ఏ కడియం శ్రీహరి పట్టణ కేంద్రానికి చేరుకుని, ఆదివారం బోసు ఐలయ్య పార్థివా దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. చిల్పూర్ మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన కొన్నె కరుణాక ర్ ఇటీవల మృతిచెందగా మాజీ ఉప ముఖ్యమం త్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చిల్పూర్ దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు,మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, వైస్ చైర్మన్ నీల రాజమ్మ గట్టయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి,చిల్పూర్ మండల అధ్యక్షుడు చిర్ర నాగరాజు గౌడ్,పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజు,



స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయ కులు గన్ను నర్సింహులు, బూర్ల శంకర్, పెసరు సారయ్య, కలిపాక సతీష్, సింగపురం వెంకట య్య, చింత ఎల్లయ్య,పోశాల కృష్ణమూర్తి, శ్రీనివా స్, రాజు,వివిధ గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బారాములు యూత్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు

### వ్యవస్థాపక అధ్యక్షులు బానోత్ చెందులాల్ నాయక్ వెల్లడి

**గూడూరు ఆగస్టు03(జనంసాక్షి):**మూడు గుడిసెల లైన్ తండా గ్రామంలో పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధే లక్ష్యంగా దుబ్బ రాములు యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని ఏర్పాటు చేసుకున్నామని వ్యవస్థాపక అధ్యక్షులు బానోత్ చెందులాల్ అన్నారు.ఆదివారం గూడూరు మండలం మూడు గుడిసెల లైన్ తండాలో పాత కమిటీ రద్దు చేస్తూ నూతన కమిటీని ప్రకటించినట్లు అయన తెలిపారు.అధ్యక్షులుగా బానోతు బాలు నాయక్ ఉపాధ్యక్షులుగా ధారావత్ గణేష్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోతు రమేష్ (మంగీలాల్),కార్యదర్శిగా బోడ ఈరు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా లకా వత్ మోహన్ నాయక్ ను ఎన్నుకున్నట్లు అయన తెలిపారు.ఈసందర్భంగా



బానోత్ చెందులాల్ నాయక్ మాట్లాడుతూ పార్టీ ఏదైనా సరే గ్రామంలోనీ సమస్యలను మనమంతా పార్టీలకు అతీతంగా పరిష్కరించుకోవాలని అన్నారు. అనంతరం నూతన కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో యువకులు,తండా వాసులు పాల్గొన్నారు.

# ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు

**నర్సంపేట, ఆగస్టు 2 ( జనం సాక్షి):** స్నేహితుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని లోటస్ పబ్లిక్ స్కూల్లో కరస్పాండెంట్ శేర్ల సంతోష్ ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువతులు, ఉపాధ్యాయులు ఫ్రెండ్షిప్ బాండ్లు కట్టుకొని స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం



స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సలేంద్ర రాకేష్, ఉపాధ్యాయులు సంజన, గట్ల రవీందర్, అశోక్, జీవన్, అఖిల, సరస్వతి, అనూష, భవిత, మదుషా, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ యువజన ఉపాధ్యక్షుడిగా తాటి పెల్లి శ్రీనివాస్



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 02 ( జనం సాక్షి ) :**ఆర్యవైశ్య మహాసభ యువజన ఉపాధ్యక్షుడిగాతాటి పెల్లి శ్రీనివాస్ ఎన్నిక కావడం జరిగిందని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.హైదరాబాదులో ఆదివారం జరిగిన ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయ ణ ఆధ్వర్యంలో యువజన విభాగం సంబంధించి తాటి పెల్లి శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పదవి రావడం జరిగింది. ఈ సందర్భంగా నూతన ఆర్యవైశ్య మహాసభ యువజన ఉపాధ్యక్షుడుతాటిపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తనకి అవకాశం కల్పించిన ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమ రావతి లక్ష్మీనారాయణకు, రాష్ట్ర, జిల్లా నాయకు లకు కృతజ్ఞతలు తెలిపారు.

# మండల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ కమిటీ ఎన్నిక



**స్టేషన్ ఘన్‌పూర్, ఆగస్టు 02 ( జనం సాక్షి ) :**స్టషన్ఘన్పూర్ మండల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ అసోసియేషన్ ఇందులో భాగంగా గౌరవ అధ్యక్షులు వల్లల మురళి, ముగ్దుంపురం కిషోర్ , మాజీ అధ్యక్ష్యుడు ఊరడీ రాజు ఆధ్వర్యంలో ఆదివారం స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని శ్రీ తిరుమలనాథ స్వామి దేవాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగినది. అధ్యక్షుడు గా చిట్యాల సురేష్, ఉపా ధ్యక్షులుగా తాటికొండ శ్రీధర్,ఎండి జాఫర్, ప్రధాన కార్యదర్శి మారపాక అన్వేష్,సహాయకార్యదర్శి ఈగ విజయ్ కుమార్, కోశాధికారి వల్లాల సతీష్,ముఖ్య సలహాదారులు మహేశ్వరం ప్రకాష్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు మహే శ్వరం శ్యామ్, గుడి కందుల రమణ కుమార్, కిషోర్ కార్యవర్గ సభ్యులుగా దేవనూరి శ్రీకాంత్, నాగేష్, కుమార్, అనిల్, అవినాష్, మనోజ్, సినియర్ ఫోటోగ్రాఫర్లు జూని యర్ ఫోటోగ్రాఫర్ల ను ఎన్నుకోవడం జరిగింది.ఈ నూతన కార్యవర్గా నికి అభినందనలు తెలుపుతూ అందరిని సన్మా నించడం జరిగినది.

# వార్డ్ మెంబర్ ఫోరం మండల అధ్యక్షునిగా ఈర్ల పైడి



**రేగొండ (కొత్తపల్లి గోరి) ఆగస్టు 02 (జనం సాక్షి):**తెలంగాణ వార్డు సభ్యుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో మండల వార్డు సభ్యుల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వార్డ్ మెంబర్ ఫోరం అధ్యక్షునిగా ఈర్ల పైడి ఏకగ్రీవంగా ఎన్నుకోగా,వర్కింగ్ ప్రెసిడెంట్ పేరాల రాజేందర్, ఉపాధ్యక్షుడు బండారి రవీందర్,లప్రధాన కార్యదర్శి బైకాని కరుణాకర్,మండల కార్యదర్శి ఆవుల రమేష్ లను ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి శ్రీకాంత్ తెలిపారు.కార్యక్రమంలో మండలంలో ఉన్న అన్ని గ్రామాల వార్డు సభ్యులు పాల్గొన్నారు.